క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.10,116లు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానానికి ఆదివారం తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం పట్టణానికి చెందిన నామా శరత్‌బాబు రూ.10,116 విరాళాన్ని ఆలయ ఈఓ కిషోర్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి



జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 470/465 మార్కులు సాధించి పట్టణంలో ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థి షేక్ అబూబకర్ సిద్దిక్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అభినందించారు. ఈ మేరకు ఆదివారం బంగారు కొట్ల సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తాతయ్య విద్యార్థి సిద్దిక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అన్వర్, మైక్రో సాఫ్ట్ ప్రతినిధి షేక్ అస్లాం, జామియా మసీదు కమిటీ మాజీ సెక్రటరీ షేక్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టివేత



తిరువూరు: ఎ.కొండూరు మండలం కొత్త రేపూడి రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 34 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని కనిపించకుండా మొక్కజొన్న విత్తనాలతో కలిపి ప్యాక్ చేసిన మిల్లు నిర్వాహకులు అధికారుల కన్నుగప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. విస్సన్నపేటలో కూడా ఒక రైస్ మిల్లులో ఇదే విధంగా మొక్కజొన్న విత్తనాలతో కలిపి రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొత్త రేపూడి మిల్లు యజమానిపై కేసు నమోదు చేశామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

చేప మందు పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా రోగులకు ఉచిత చేప మందు పంపిణీ కార్యక్రమం కొండపల్లిలో ఆదివారం జరిగింది. గత 75 ఏళ్లుగా ఆస్తమా రోగులకు జనాబ్ హాజీ హకీ మహమ్మద్ యూసుఫ్ అలీ కుటుంబం కొండపల్లిలో చేప మందు పంపిణీ చేస్తున్నారు. జనాబ్ హాజీ హకీ మహమ్మద్ యూసుఫ్ అలీ మృతిచెందడంతో వారి మనువళ్లు మహమ్మద్ మసూద్ అలీ జిన్నా, మహమ్మద్ మహమూద్ అలీ ప్రతి ఏడాది మృగశిర కార్తె తొలి రోజు చేప మందు పంపిణీ చేస్తున్నారు. కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి సుమారు 375 మంది రోగులు వచ్చి చేప మందు తీసుకున్నారు. అనంతరం చేప మందును తీసుకున్నవారు పాటించవలసిన జాగ్రత్తలను సూచించారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను నిరసిస్తూ ఉపాధ్యాయుల ధర్నా



తిరువూరు: ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ గంపలగూడెం మండల పీఆర్‌టీయూ, డీపీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం మండల విద్యా శాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్ వలన ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీపీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు ఎస్. నరసింహారావు, ఏవీ నరసింహారావు నాయకత్వం వహించారు.

90 మందికి వైద్య పరీక్షలు

జి.కొండూరు: మండల పరిధి కవులూరులో ధన్వంతరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఈశ్వర్ పర్యవేక్షణలో 90 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి 35 రోజులకు సరిపడా మందులను అందజేశారు. ప్రతి నెలా రెండో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

కరుణించమ్మా.. కాపాడమ్మా



బోనాలు సమర్పించడానికి వచ్చిన భక్తులు



ఆలయం బయట భక్తజనం



అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలో భక్తుల రద్దీ



ఆలయం చుట్టూ వాహనాల రద్దీ

పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. ఆలయం చుట్టూ వాహనాలు బారులుతీరాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. –పెనుగంచిప్రోలు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వీ మానస ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవాలని సూచించారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

నందిగామ రూరల్: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని యోగా గురువు గాడిపర్తి సీతారామారావు పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలోని ఖాశీం అండ్ ఖాశీం వృద్ధాశ్రమంలో ఆదివారం యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమవుతూ థీమ్ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తూ అవగాహన కలిగిస్తున్నామని చెప్పారు. భారతదేశ వారసత్వ సంపద యోగాను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. యోగాను ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ అధికారి శ్రీరాములు, యోగాంధ్ర కోఆర్డినేటర్లు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ కవిత, వృద్ధాశ్రమ నిర్వాహకులు కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వరాలిచ్చే కల్పవల్లి.. మద్దులమ్మ అమ్మవారు

- గొట్టుముక్కల రిజర్వు ఫారెస్ట్‌లో వెలసిన మద్దులమ్మ తల్లికి వరదపాశం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- కొండపై ఉన్న ప్రకృతి అందాలకు ఆకర్షితులవుతున్న భక్తులు



మద్దులమ్మ కొండపై ప్రకృతి అందాలను తిలకిస్తున్న భక్తులు

గొట్టుముక్కల(కంచికచర్ల): కంచికచర్ల మండలం గొట్టుముక్కల రిజర్వు ఫారెస్ట్ కొండపై వెలసిన మద్దులమ్మ తల్లికి తాటుకూరి వారసులు ముందుగా అమ్మవారికి ఆదివారం వరదపాశం పోశారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వరదపాశం పోశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి వరద పాశం పోస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పంట ఉత్పత్తులు బాగా పెరుగుతాయని నమ్మకంతో అడవి తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధికి ట్రాక్టర్లు, కార్లు, బైక్‌ల ద్వారా చేరుకుని వరదపాశం పోశారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు, పాయసం చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు

రిజర్వు ఫారెస్ట్ కొండపై వేంచేసి ఉన్న మద్దులమ్మ అమ్మవారిని పూజించేందుకు భక్తులు ప్రతి ఆదివారం పెద్ద సంఖ్యలో వస్తారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారుగా భక్తులు నుంచి విశేష పూజలు అందుకుంటున్నారు.



మద్దులమ్మ తల్లికి పూజలు చేస్తున్న అర్చకుడు

ప్రకృతి సోయగాలు

రిజర్వు ఫారెస్ట్‌లో కొండపై కొలువై ఉన్న మద్దులమ్మ తల్లి ఆలయం సమీపంలో ప్రకృతి సోయగాలను భక్తులు తిలకించారు. ఎత్తైన కొండపై నుంచి కిందకు జలపాతం పారుతుండటంతో ఆ జలపాతాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండ కింద పచ్చని పంట పొలాలు, కొండపైన రకరకాల జంతువులు, రంగు రంగుల పక్షులు, పారుతున్న సెలయేరును చూసి భక్తులు, పర్యాటకులు ఆనందపరవశం పొందారు. అమ్మవారి ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తాటుకూరి వంశస్థులు, భక్తులు, పర్యాటకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పేదవాడి సొంతింటి కల ఛిద్రం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో పేదవాడి సొంతింటి కల ఛిద్రం అయిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు స్థలం అందజేయడం జరిగిందన్నారు. తద్వారా రాష్ట్రంలో 33 లక్షల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు, 22 లక్షల గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. గృహ నిర్మాణాలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు. మహిళల పేరుతోనే రూ. 1 ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారని గుర్తుచేశారు. కాగా నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే లేదన్నారు. ఏడాది పాలనలో ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వకపోవడంతో వేలాది మంది స్థలాలు, ఇళ్ల కోసం అన్ని గ్రీవెన్స్‌లోనూ అర్జీలు, అధికారులకు వినతులు అందజేస్తున్నారని తెలిపారు. జగనన్న కాలనీల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకుండా కక్ష సాధింపు చర్యగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వీరులపాడు: రౌడీషీటర్లు అసాంఘిక, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఎస్‌ఐ అనిల్ పేర్కొన్నారు. వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉందని ఎప్పటికప్పుడు వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు, వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే రౌడీషీటర్లను గుర్తించి వారిపై ఉన్న షీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వారితో నేరాలకు పాల్పడమని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామ రూరల్: నేరచరిత్ర కలిగిన వారు తీరు మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా నడుచుకోవాలని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా వివాదాలు, ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నేర చరిత్రను మానుకుని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకర జీవితాన్ని గడపాలని సూచించారు. అనంతరం నేరాలు, తదితర శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేయమని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాక్టీస్ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా అద్దంకి

నందిగామ టౌన్: నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ప్రాక్టీస్ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. విజయవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు గౌరి మణి, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావులు మణిబాబును జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది మంది న్యాయవాదులకు వెల్ఫేర్ సొసైటీ తల్లిలాంటిదని పేర్కొన్నారు. ముఖ్యంగా న్యాయవాదులకు ప్రయోజనాలను చేకూర్చడంలో ఈ వెల్ఫేర్ సొసైటీ ముందుంటుందని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బాల సుబ్రహ్మణ్యానికి స్వరాంజలి



బాలు సినీరంగ సేవల కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యంలో సినీ నిర్మాత, గాయకుడు, సినీ సంగీత దర్శకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సినీ రంగ సేవలను గుర్తుచేసుకుంటూ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. నిర్వాహకురాలు ఝాన్సీ పర్యవేక్షణలో ఆయన గానం చేసిన తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ, చిత్రాలలోని పాటలను గాయనీ గాయకులు ఉష, జానకి, లక్ష్మీదుర్గ, శైలజ, సత్య, సుకన్య, షబానా, శ్రీనివాస్, చెరుకూరి శ్రీనివాస్ ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన చింతకాయల చిట్టిబాబు, వెంకట్, ఎస్. బాజీ, జ్ఞాన సుందరి తదితరులు బాలు సినీ రంగ సేవలను వివరించారు. జేఎంఎస్ సంస్థ ఉపాధ్యక్షుడు బాజీ నిర్వహించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం



నిరుపయోగంగా ఉన్న సచివాలయ భవనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జగ్గయ్యపేట రోడ్డులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 40లక్షల వ్యయంతో ఏడాది క్రితం సచివాలయ భవనం-1ను నిర్మించి ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాలపై కక్ష్య కట్టడంతో ఈ సచివాలయాన్ని నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. సిబ్బందికి మరుగుదొడ్లు లేవనే సాకుతో సచివాలయ భవనం నిరుపయోగంగా ఉంటోంది. ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యాలయంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయం-1 నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు స్విమ్మింగ్ పోటీలు



స్విమ్మింగ్ పోటీ విజేతలతో ఎమ్మెల్యే తాతయ్య, స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఫౌండర్, కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ సమీపంలోని పాలేటిలో 2వ ఓపెన్ ఈత పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో 10 మంది బాలికలు, 14 మంది బాలురు, 10 మంది మహిళలు, 7 మంది పురుషులు మొత్తం కలిసి 41 మంది పాల్గొన్నారని చెప్పారు. గెలుపొందిన వారికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విజేతలందరికి డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ టీం మేనేజర్ అన్నంనీడి కల్యాణ్, ప్రెసిడెంట్ మందడపు శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కలాలి నరేష్, కోచ్ పొట్టాబత్తిన సందీప్, కృష్ణా స్విమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీఎస్పీ మోటపోతుల కిషోర్‌బాబు, అధ్యక్షుడు కె.కరుణాకర్, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు రాటకొండ శ్రీనివాస్, పిన్నెల్లి పాండురంగారావు తదితరులు అభినందనలు తెలిపారు.

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు

రాయనపాడు(విజయవాడరూరల్): మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు సాధ్యమని విజయవాడ రూరల్ మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ బాబు అన్నారు. రాయనపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ రంగనాథ్‌బాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రైతు ముందుగా భూసార పరీక్షలు చేయించుకొని దాని ఫలితంగా పంటలను సాగు చేసుకోవాలని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయవచ్చన్నారు. శిక్షణ వ్యవసాయ సహాయ శాస్త్రవేత్త కె.రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు మేలు రకం విత్తనాలతో నారుమడి పోసుకొని నాట్లు వేయాలన్నారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం జక్కంపూడి గ్రామ రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు ఎన్జీరంగా

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు ఆచార్య గోగినేని రంగా (ఎన్జీ రంగా) అని కాకాని ఆశయ సాధన సమితి చైర్మన్ డాక్టర్ కాకాని తరుణ్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా, కాకాని వెంకటరత్నం వంటి వారి ఆదర్శాలను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆచార్య గోగినేని రంగా వర్ధంతిని పురస్కరించుకుని ఎంజీరోడ్డులోని ఆయన విగ్రహానికి ఎన్జీ రంగా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ట్రస్టు అధ్యక్షుడు గోగినేని ధనశేఖర్, డాక్టర్ తరుణ్ కాకాని తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తరుణ్ కాకాని మాట్లాడుతూ ఎన్జీ రంగా, కాకాని వెంకటరత్నం ఇద్దరూ 1900 సంవత్సరంలో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జన్మించినట్లు తెలిపారు. ఇద్దరూ స్వాతంత్ర్య సమరయోధులుగా మారారని, అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించినట్లు తెలిపారు. కాకాని వెంకట రత్నం వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖతో క్యాబినెట్ మంత్రిగా సమాజ అభ్యున్నతికి కృషి చేయగా, ఎన్జీ రంగా దాదాపు మూడు దశాబ్దాల పాటు పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారన్నారు. గుంటూరులో వ్యవసాయ విశ్వ విద్యాలయానికి ఎన్జీ రంగా పేరు పెట్టినట్లు తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని గోగినేని ధనశేఖర్ అన్నారు. ట్రస్టు కార్యదర్శి రవి , భాను, నిఖిల్, కె.బసవ పాల్గొన్నారు.



ఎన్జీ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తరుణ్, ధనశేఖర్ తదితరులు

ఇంజినీరింగ్ కళాశాలల్లో అవకతవకలపై చర్యలు తీసుకోండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ముఖ్యంగా జేఎన్‌టీయూకేకు అనుబంధంగా ఉన్న స్వయం పాలిత ఇంజినీరింగ్ కళాశాలల్లో అవకతవకల పట్ల అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కొన్ని స్వయం పాలిత కళాశాలలు పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల విడుదల వరకు వ్యవస్థలను నియంత్రిస్తూ విద్యా నైతికతను దెబ్బతీస్తున్నాయని పేర్కొంది. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీటీపీఐఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. సీఎస్‌ఈ విభాగం, అనుబంధ శాఖలలో నిబంధనలకు విరుద్ధంగా అర్హతలేని అధ్యాపకులను నియమించి బోధన చేస్తున్నారన్నారు. ప్రతి ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి, అధ్యాపకుల ప్రయోజనాలను రక్షించడానికి ఫ్యాకల్టీ అసోసియేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుబంధ, స్వయం పాలిత కళాశాలలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో నైతిక విలువలు, నాణ్యతను పెంచేందుకు కృషి చేయాలని కోరారు.